
AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
28-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

యథేచ్ఛగా అక్రమ వెంచర్లు..



2



2

పీహెచ్‌సీ ఆవరణలో వడ్లు ఆరబోశారు

## కోఆప్షన్ పదవులకు 13 నామినేషన్లు

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల పదవుల కోసం మొత్తం 13 నామినేషన్లు నమోదయ్యాయి. ఈ నెల 17 నుంచి 28 వరకు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. మున్సిపల్ కమిషనర్ మహేష్ మాట్లాడుతూ, దాఖలైన నామినేషన్లను స్క్రూటినీ నిర్వహించి జాబితాను మున్సిపల్ ఛైర్మన్‌కు నివేదిస్తామని తెలిపారు. మున్సిపల్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ఛైర్మన్ ఆధ్వర్యంలో కోఆప్షన్ పదవులకు ఎన్నికలు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్తి స్థాయిలో కౌన్సిలర్లు ఉండటంతో కో-ఆప్షన్ అభ్యర్థుల ఎన్నిక సైతం ఏకగ్రీవంగా అయ్యే అవకాశాలే అధికంగా ఉంటాయి. పార్టీకి పనిచేసిన అభ్యర్థులకే పదవులు దక్కుతాయని సమాచారం.

## మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్ల పరిశీలన



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో ఇన్‌ఛార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరియంను సందర్శించారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో రాజేంద్ర కుమార్, డీడబ్ల్యూవో పద్మ తదితరులు ఉన్నారు.




## ప్రయాణమా.. ప్రాణసంకటమా..!

నగరంలో రహదారులు ప్రమాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయి. కిషన్ గంజ్‌కు వెళ్లే మార్గంలో.. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంగా రోడ్డుపై కార్పొరేషన్ సిబ్బంది డ్రెయినేజీ గుంతలను తవ్వి వదిలేశారు. ఈ ప్రాంతంలో రెండు బారికేడ్లను పెట్టారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఈ గుంతలు, బారికేడ్ల కారణంగా విపరీతమైన ట్రాఫిక్‌జాం ఏర్పడుతోంది. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే ఈ గుంతలను పూడ్చివేయాలని నగరవాసులు కోరుతున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్








# బిల్లుల కోసం సంతకం ఫోర్జరీ

అధికారి ఫోర్జరీ సంతకాలతో ఏకంగా ప్రభుత్వ బిల్లు తీసుకోవడానికి ప్రయత్నించాడో వ్యక్తి. ఈ ఘటన కామారెడ్డి మున్సిపాలిటీలో తీవ్ర కలకలం రేపింది. బిల్లుల కోసం సంతకం ఫోర్జరీ చేసిన ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- యోగా ధ్యాన కేంద్రానికి ప్రభుత్వం అనుమతి
- పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- ఎన్‌వోసీ ఇవ్వని టీపీవో
- ఫోర్జరీ చేసి పత్రాలు సమర్పించిన నిందితుడు

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఓ స్థలంలో ధ్యాన మందిరం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. స్థలం విషయంలో ఇబ్బంది రాగా ఏకంగా సంబంధిత శాఖ అధికారి సంతకాన్నే ఫోర్జరీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ అంశం అటు అధికార వర్గాలను, ఇటు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. మున్సిపాలిటీకి చెందిన అధికారి సంతకమే ఫోర్జరీ చర్యడం తీవ్ర చర్చకు దారి తీస్తోంది.

### ధ్యాన మందిరం కోసం..

కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఇల్చిపూర్ శివారులోని ఓ స్థలంలో పిరమిడ్ ధ్యాన మందిరానికి ప్రభుత్వం రూ.5 లక్షలు నిధులు మంజూరు చేసింది. అయితే ఆ స్థలం గతంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా విలీనం తర్వాత మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చింది. సంబంధిత స్థలంలో ఎలాంటి నిర్మాణం చేపట్టాలన్నా మున్సిపల్ అనుమతి కావాల్సి ఉంది.

### ఎన్‌వోసీకి నిరాకరణ

పిరమిడ్ ధ్యాన మందిరం మంజూరు కాగానే ఎలాగో నిధులు వస్తాయి కదా అని పనులు మొదలు పెట్టారు. బేస్మిట్ పూర్తి చేసి పిల్లర్లు వేశారు. నిధులు రాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి అనుమతికి నిరాకరించినట్టుగా సమా చారం. టౌన్ ప్లానింగ్ నుంచి ఎన్‌వోసీ వస్తేనే చేపట్టిన నిర్మాణానికి బిల్లు మంజూరు అవుతుంది. నిర్ణయించిన గడువు లోపు ఎన్‌వోసీ ఇవ్వలేకపోతే నిధులు వెనక్కి వెళ్లి పోతాయి. దీంతో నిర్మాణం చేపట్టిన వ్యక్తి వద్ద నుంచి నిందితుడు ఎన్‌వోసీ ఇప్పిస్తానని చెప్పి రూ.10 వేలు తీసుకున్నట్టుగా తెలుస్తోంది. ఆ డబ్బు తీసుకుని ఏకంగా టీపీవోకు సంబంధించిన స్టాంప్ తయారు చేయించి సం తకాన్ని ఫోర్జరీ చేసినట్లు సమాచారం. అనంతరం ఎన్‌వోసీని పంచాయతీ రాజ్ శాఖ అధికారులకు సమర్పించారు.

### టీపీవో ఫిర్యాదుతో..

సంబంధిత స్థలంలో పిరమిడ్ ధ్యాన మందిరం నిర్మాణం జరుగుతుందని తెలుసుకున్న మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టగా ఫోర్జరీ సంతకంతో ఎన్‌వోసీ తయారు చేసినట్టుగా తేలింది. దాంతో సదరు టీపీవో దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు మొదట ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు.

అందులో ఫోర్జరీ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. నిందితుడి కారులో భారీగా పత్రాలు, స్టాంపులు లభించినట్టుగా సమాచారం. ఫోర్జరీ కేసు విషయమై టీపీవో వివరణ కోసం ఫోన్ చేయగా ఆయన ఫోన్ కలవలేదు.

### ఫోర్జరీ కేసు నిజమే

ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా టీపీవో సంతకం ఫోర్జరీపై కేసు నమోదు చేసిన విషయం నిజమేనన్నారు. ఈ కేసులో విచారణ అనంతరం ఫోర్జరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేశామన్నారు. కేసులో విచారణ జరుగుతుందని పేర్కొన్నారు. అయితే టీపీవో సంతకం మాత్రమే ఫోర్జరీ చేశారా..? లేక గతంలో ఇంకా ఏవైనా ఫోర్జరీ చేసిన దాఖలాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** పేదలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం పలువురికి ఎల్‌వోసీ పత్రాలు అందజేశారు. అర్హులైన పేదలకు ఎల్‌వోసీ ఇప్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని మాలపల్లికి చెందిన అహ్మదీ బేగం నరాల సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతుండగా.. నిమ్స్‌లో చికిత్స నిమిత్తం రూ.5లక్షల ఎల్‌వోసీ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా ప్రజల ప్రాణాలను కాపాడటమే తన కర్తవ్యమన్నారు.




## చైల్డ్ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లావ్యాప్తంగా చైల్డ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం నగరంలోని ఎస్‌ఆర్ కళాశాల, విక్టర్ కళాశాలలో అవేర్‌నెస్ క్యాంప్ జరిగింది. ఈ సందర్భంగా డబ్ల్యూ ఎస్సై పుష్పావతి, కోఆర్డినేటర్ రోజా మాట్లాడుతూ.. మహిళల భద్రత, బాలల రక్షణ, లింగ సమానత్వం, పితృస్వామ్యం, జెండర్ బైయాస్, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు తమ హక్కులపై అవగాహనతో అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## లింగంపల్లి ఖుర్దు, అడ్విలింగాల వంతెనలకు నిధులు మంజూరు: ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** లింగంపల్లి ఖుర్దు, అడ్విలింగాల వంతెనలకు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే మదన్‌మోహన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆయన హైదరాబాద్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని అత్యవసర సమస్యలపై చర్చించారు. ఇటీవల వరదల కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న లింగంపల్లి ఖుర్దు బ్రిడ్జి, అడ్విలింగాల వంతెనల నిర్మాణానికి తక్షణ నిధులు మంజూరు చేయాలని డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ రెండు వంతెనల పునర్నిర్మాణంతో రైతులు, సాధారణ ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి రోజువారీ కార్యకలాపాలు సులభతరం అవుతాయని



ఆయన వివరించారు. ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాలను సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా సందర్శించిన విషయాన్ని గుర్తుచేస్తూ, సమస్య తీవ్రతను ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా, నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యేందుకు కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ అంశాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. లింగంపల్లి ఖుర్దు వంతెన, అడ్విలింగాల వంతెన మంజూరు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పెండింగ్ బిల్లుల సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## రేపు కాంగ్రెస్ పార్టీ భవన నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, ఇందూరు :** నగరంలో కాంగ్రెస్ పార్టీ నూతన భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం జరగనుంది. ముఖ్యఅతిథిగా పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, అతిథిగా మంత్రి సీతక్క హాజరుకానున్నారు. నగరంలోని రైల్వేస్టేషన్‌కు కొద్ది దూరంలో కొన్నేళ్లుగా పార్టీ కార్యాలయం కొనసాగుతోంది. అయితే అద్దె భవనంలో పార్టీ కార్యక్రమాలు కొనసాగించడం ఇబ్బందిగా మారింది. దీంతో కాంగ్రెస్ భవన్ ఎదురుగానే ఉన్న స్థలంలో ప్రస్తుతం కొత్తగా పార్టీ కార్యాలయాన్ని నిర్మించనున్నారు. దీనికి సంబంధించి డీసీసీ అధ్యక్షుడు కాట్‌పల్లి నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మేయర్ ఉమారాణి, నుడా ఛైర్మన్ కేశ వేణు, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు.

## కొనుగోలు కేంద్రం నిర్వహణ తీరుపై కలెక్టర్ ఆగ్రహం

### ఏపీఎంకు షోకాజ్ నోటీస్ జారీకి ఆదేశం



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల పట్ల అలసత్వం వహించడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. భీమ్‌గల్ మండల ఐకేపీ ఏపీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. భీమ్‌గల్ మండలం పల్లికొండ, భీమ్‌గల్ గ్రామాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. పల్లికొండ కొనుగోలు కేంద్రం నిర్వహణలో లోటుపాట్లు ఉండడాన్ని కలెక్టర్ గమనించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవడం, రిజిస్టర్ అందుబాటులో లేకపోవడం వంటి లోపాలను గుర్తించిన కలెక్టర్ కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వహణ తీరు ఇలాగే ఉంటే కమీషన్ నిలిపివేస్తామని, వచ్చే సీజన్ నుంచి సెంటర్ ను కేటాయించబోమని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, పర్యవేక్షణ చేయాల్సిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఏపీఎంకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రైతుల ప్రయోజనాలతో ముడిపడిన అంశాలలో విధులపై నిర్లక్ష్యాన్ని ఎంతమాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తూకం వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. డీఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, సివిల్ సప్లయిస్ డీఎం ప్రవీణ్, డీసీవో శ్రీనివాస్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకలు ఘనంగా జరిగాయి. లబ్ధిదారుడు అరికెల కిష్టన్న నూతన గృహప్రవేశ కార్యక్రమానికి సర్పంచ్ మంజుల సాయిల్, ఎల్లారెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కురుమ సాయిబాబా హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి, ఎంపీవో, సూపరింటెండెంట్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్ నాయక్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, యూత్ టౌన్ అధ్యక్షులు సిద్ధు, ఉప సర్పంచ్ సాయిరాంతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.





## బాన్సువాడలో పెట్రోల్ కొరత..

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో పెట్రోల్, డీజిల్ కొరత తీవ్రరూపం దాలుస్తోంది. పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో కొన్ని బంకులు పూర్తిగా మూతపడగా, మరికొన్ని బంకుల్లో పరిమితంగా మాత్రమే ఇంధనం అందిస్తున్న పరిస్థితి నెలకొంది. సరఫరాలో అంతరాయం ఏర్పడటం వల్లే ఈ కొరత నెలకొన్నట్లు తెలుస్తోంది. ఆయిల్ ట్యాంకర్లు సమయానికి రాకపోవడం, డిమాండ్ పెరగడం కూడా కారణాలుగా చెబుతున్నారు

### కామారెడ్డిలో..

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో రెండోరోజు పెట్రోల్, డీజిల్ కష్టాలు ప్రజలను వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో కొరత లేకున్నా డీడీలు చెల్లించని కారణంగా పెట్రోల్, డీజిల్ కొరత ఉందని ప్రచారం సాగుతోంది. నిన్న మధ్యాహ్నం తర్వాత మూతపడిన పెట్రోల్ బంకులు ఇప్పటికి తెరుచుకోలేదు. దాంతో పెట్రోల్, డీజిల్ కొరత నిజంగానే ఉందేమోనన్న భయంతో ప్రజలు వాటర్ బాటిల్స్, డీజిల్ క్యాన్లతో అందుబాటులో ఉన్న బంకుల వద్ద భారీగా క్యూ కట్టారు. ప్రస్తుతం వరికోతలు కొనసాగుతున్నాయి. వరికోత మిషన్లకు డీజిల్ ఖచ్చితంగా అవసరం కావడంతో క్యాన్లతో క్యూలో నిలబడ్డారు.





# యథేచ్ఛగా అక్రమ వెంచర్లు..

భీమ్‌గల్ పట్టణంతో పాటు మండల పరిధిలోని ప్రధాన రహదారుల వెంట అక్రమ వెంచర్ల దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. గ్రామీణుల అమాయకత్వాని ఆసరాగా చేసుకుని ఈ వెంచర్లలో ప్లాట్లు అంటగడుతున్నారు. ఎలాంటి డీటీసీపీ అనుమతులు లేకుండానే సాగు భూములను ప్లాట్లుగా మార్చి రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం లేఅవుట్లలో వదలాల్సిన ఖాళీ స్థలాలు, కనీస మౌలిక సదుపాయాలను గాలికొదిలేసి, అమాయక కొనుగోలుదారులను బురిడీ కొట్టిస్తున్నారు. – భీమ్‌గల్, అక్షరటుడే

- అనుమతుల్లేని వెంచర్ల మాయాజాలం!
- భీమ్‌గల్‌లో యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లు
- నిబంధనలు బేఖాతరు.. అమాయక ప్రజలే టార్గెట్
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న యంత్రాంగం

పట్టణంలో వెంచర్ల రిజిస్ట్రేషన్లలో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. రిజిస్ట్రేషన్ సమయంలో భూమిని వ్యవసాయ భూమిగా చూపిస్తూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన నాలా (Nala) పన్ను, ఇతర ఫీజులను ఎగ్గొడుతున్నారు. 'అనుమతులు వస్తాయి.. తక్కువ ధరకే ప్లాట్లు ఇస్తాం' అంటూ మధ్యవర్తులు నమ్మబలికి ప్రజలను మోసం చేస్తున్నారు. లేఅవుట్లలో 10 శాతం స్థలం మున్సిపాలిటీకి కేటాయించాలి. అంతర్గత రోడ్లు 33 అడుగులు ఉండాలి. కానీ ఇవేవీ ఇక్కడ అమలు కావడం లేదు.

### అయ్యప్ప నగర్ కాలనీలో..

మండల కేంద్రంలో అయ్యప్పనగర్ కాలనీలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేసి ప్లాట్ల అమ్మకాలు జరుపుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాపూజీ నగర్, బైపాస్ రోడ్డులో గతంలోనే అక్రమ లేఅవుట్లు వెలిశాయి. నేటికీ కొత్త వెంచర్లు పుట్టుకొస్తూనే ఉన్నాయి. 10శాతం స్థలం కేటాయింపులో భారీగా గోల్‌మాల్ జరిగినట్లు తెలుస్తోంది.

### అధికారుల పర్యవేక్షణ ఏది?

అక్రమ వెంచర్ల వద్ద 'ఇది అనుమతి లేని వెంచర్.. ఇక్కడ ప్లాట్లు కొనకండి' అనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు అతిక్రమించిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### నోటీసులు జారీ చేస్తాం..

పట్టణ పరిధిలో అనుమతులు లేని వెంచర్ల వివరాలను సేకరిస్తున్నాం. నిబంధనలు పాటించని యజమానులకు త్వరలోనే నోటీసులు జారీ చేస్తాం. అనుమతులు లేని చోట ప్లాట్లు కొని ప్రజలు ఇబ్బందులు పడకూడదు. కొనుగోలు చేసే ముందు అన్ని పత్రాలను పరిశీలించుకోవాలి.

– గోపు గంగాధర్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్

## కల్లెడిలో బాలికలకు హెచ్‌పీవీ టీకాలు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామంలో బాలికల ఆరోగ్య పరిరక్షణ కోసం మంగళవారం హెచ్‌పీవీ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణలో ఈ టీకా కీలక పాత్ర పోషిస్తుందని డాక్టర్ ప్రకాష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భాశయముఖ క్యాన్సర్ మహిళల్లో అధికంగా కనిపించే ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటని చెప్పారు. అయితే హెచ్‌పీవీ వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా తమ కుమార్తెలకు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా బాలికల భవిష్యత్ ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఒకముఖ్యమైన అడుగు పడిందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, ఏఎన్ఎంస్ భగీరాతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## సీజ్ చేసిన ద్విచక్ర వాహనం వేలం

**అక్షటుడే, భీమ్‌గల్:** మండల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక కేసులో టీవీఎస్ ఎక్స్ఎల్‌ను అధికారులు గతంలో పట్టుకున్నారు. ఈనెల 30న బైక్‌కు బహిరంగ వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు భీమ్‌గల్ ఎక్సైజ్ స్టేషన్ ప్రాంగణంలో ఈ వేలం నిర్వహించనున్నామని.. ఆసక్తి గలవారు సకాలంలో హాజరుకావాలని కోరారు.



## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


**అక్షరటుడే, ఆర్మూర్ :** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతిఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై యాసిర్ అల్తాఫ్ అన్నారు. ఆలూరు మండలం దేగాం గ్రామంలో మంగళవారం 'మన ఊరు మన బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ట్రాఫిక్ నియమాలు, మత్తు పదార్థాల వినియోగం దాని పర్యవసానాలు, సైబర్ నేరాల కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వీడీసీ సభ్యులు, సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి, వార్డు మెంబర్లు ఐకేపీ మహిళలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి ఘన స్వాగతం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్ గ్రామంలో సుభాష్ రెడ్డి గృహంలో సోమవారం పోచమ్మ పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు, జగిత్యాల మాజీ ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి హాజరయ్యారు. సుభాష్ రెడ్డి తమ్ముడు సుదర్శన్ రెడ్డి కుమారుడి వివాహం సందర్భంగా నిర్వహించిన పోచమ్మ పండుగ కార్యక్రమానికి జీవన్ రెడ్డి విచ్చేశారు. జీవన్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనను సన్మానించారు.

## భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ తల్లిబోనాలు



**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని బడా భీమ్‌గల్ గ్రామంలో వెలిసిన పెదంగంటి ఎల్లమ్మతల్లికి మంగళవారం భక్తులు బోనాలను సమర్పించారు. ఉదయం నుంచే మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు, మంగళహారతులతో గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, బలి కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) అధ్యక్షుడు మోర్తా లింబాద్రి, సర్పంచ్ రాచకొండ విష్ణువర్ధిని శంకర్ గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



## సాంబాపూర్‌లో రోడ్డు సమస్యను పరిష్కరించాలి..



**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలం సాంబాపూర్ గ్రామంలో నెలకొన్న రోడ్డు సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహశీల్దార్ సవాయి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గత 60, 70ఏళ్లుగా పంట పొలాలకు వెళ్లే ఈ రోడ్డును ఉపయోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం ఆ రహదారి తమ పరిధిలో ఉందని పేర్కొంటూ ఓ వ్యక్తి రోడ్డును తవ్వేస్తున్నాడని ఆరోపించారు. అడ్డు చెప్పిన తమపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించి తమకు న్యాయం చేయాలని తహశీల్దార్‌ను కోరారు.



## రైస్‌మిల్‌పై సీసీఎస్ పోలీసుల దాడి..

**అక్షరటుడే, బోధన్:** బోధన్ నియోజకవర్గంలో రైస్ మిల్‌పై సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేశారు. సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు కలిసి సాయి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో పీడీఎస్ బియ్యం డంప్ ఉందనే సమాచారంతో దాడి చేశారు. ఈ క్రమంలో పీడీఎస్ బియ్యం ఉన్న లారీని, బియ్యం డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం 193 క్వింటాళ్ల బియ్యంతో పాటు లారీని సీజ్‌చేశారు. ఈ రైడ్‌లో బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎస్‌హెచ్‌వో, సీసీఎస్ ఎస్సైలు పాల్గొన్నారు.

## మోస్రాలో విషాదం..

## వడ్లకుప్పను స్కూటీ ఢీకొని యువతి మృతి



**అక్షరటుడే, బాన్సువాడ:** మోస్రాలో విషాదం చోటుచేసుకుంది. వడ్లకుప్ప రూపంలో యువతిని మృత్యువు కబలించింది. నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడకు చెందిన యువతి మోస్రాలో ఉన్న తన బంధువుల ఇంటికి సోదరితో కలిసి ఆదివారం ఉదయం వెళ్లింది. అనంతరం రాత్రి 8 గంటల సమయంలో వీరు స్కూటీపై నిజామాబాద్‌కు తిరిగి ప్రయాణమయ్యారు. అయితే మోస్రా శివారులో వడ్డకుప్పను వీరి స్కూటీ ఢీకొనగా వెనుక కూర్చున్న యువతి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. దీనికి సంబంధించి వర్ని పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వివాహిత దారుణ హత్య

**అక్షరటుడే, బాన్సువాడ:** మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన వర్ని మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండలం పొట్టిగుట్ట తండాకు చెందిన కవితకు చందూర్ మండలం మేడిపల్లి తండాకు చెందిన సంతోష్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు ఉంది. అయితే కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో సంతోష్ మృతి చెందడంతో కవిత తన పుట్టింటికి వచ్చేసింది. ఆ తర్వాత కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఓ వ్యక్తితో గొడవ జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగి సదరు వ్యక్తి కత్తితో పొడిచి హత్య చేసినట్లు సమాచారం. ఘటనా స్థలంలోనే కవిత మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసి ఉంటుందనే కోణంలో పోలీసు దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## పీహెచ్‌సీ ఆవరణలో వడ్లు ఆరబోశారు

వరికోతలు పూర్తయ్యాయి. రైతులకు కల్లాల కొరత ఉండడంతో రోడ్లపైనే ధాన్యం ఆరబోస్తున్నారు. అయితే మోపాల్ మండలం మంచిప్ప పీహెచ్‌సీలోని ఖాళీస్థలంలో వడ్లు ఆరబోయడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్

## ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్ పట్టివేత

**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని శ్రీరాంపూర్ గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను ఏమాత్రం సహించబోమని, ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని కోరారు.